

వంద మాటలు చెప్పడం కంటే,
ఒక మంచి పని చేసి చూపడం మేలు.
- కందుకూరి వీరేశలింగం


# జనస్వరం

అక్షరమే ఆయుధం

www. Janaswaram.com



**పాఠకులకు విజ్ఞప్తి :**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రికలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పబ్లిసిటీ కొరకు అడ్వర్టయిజ్మెంట్ జన్మదిన శుభాకాంక్షలతో పాటు మరియు ఇతర అన్ని రకముల కార్య క్రమాలతో వగైరా ప్రకటనలు ఇవ్వండి. మరిన్ని వివరములకు మా మెయిల్ ఐడి janaswaramnews@gmail.com ను సంప్రదించండి.



సంపుటి : 01 సంచిక : 24 ఎడిటర్ : నరేష్ సాకే వారసంచిక ( 20-12-2020 ) పేజీలు : 6

/ janaswaramNEWS / 9642067900


# దివీస్ వ్యతిరేక పోరాట సమితికి అండగా నిలుస్తాం


## ప్రధాన కార్యదర్శులు శ్రీ శివశంకర్ రావు, శ్రీ బొలిశెట్టి సత్య నారాయణ

## దివీస్ మాకొద్దు - పర్యావరణమే మాకు ముద్దు హామీని మరిచిన వైయస్ జగన్మోహన్ రెడ్డి



తూర్పు గోదావరి : తోండంగి మండలంలోని కొత్తపకలు, పంపాది పేట, ఒంటిమామిడి గ్రామాల నుండి 10 మంది రైతుల బృందం విశాఖపట్నంలోని జనసేన పార్టీ ప్రాంతీయ కార్యాలయానికి వచ్చి తమ మండలంలో దివీస్ కాలుష్య తయారీ యూనిట్ నిర్మాణం ప్రారంభించడంపై తీవ్ర ఆందోళన, బాధలను వ్యక్తం చేశారు. శ్రీ జగన్ మోహన్ రెడ్డి తోండంగిలో దివీస్ యూనిట్‌కు పునాది రాయి వేస్తున్నట్లు వార్తలు వచ్చినప్పటి నుండి, తునిలోని తొండంగి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. నిరాహార దీక్షలు చేస్తూ జీవశ్చవాల్లా బతుకుతున్నారు. ఇతరులతో పాటు ఉపవాసం చేస్తున్న శ్రీ పాలినేటి పంపరాజు ఉపవాసదీక్ష 4వ రోజున చనిపోయాడని, అయితే బయటి ప్రపంచానికి ఈ విషయం తెలియదని వాపోయారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు శ్రీ టి శివశంకర్ రావు & బొలిశెట్టి సత్యనారాయణ డిసెంబర్ 10న రోడ్డు పక్కన ఉన్న కొత్తపాకలు గ్రామంలో 15 మంది నిరాహార దీక్ష చేస్తున్న వారి శిబిరం సందర్శించినప్పుడు, రాష్ట్ర ప్రభుత్వాలే వరుసగా మాకు వ్యతిరేకంగా వెళుతున్నప్పుడు మేం చెయ్యాలో పాలుపోవడంలేదు దిక్కుతోచని స్థితిలో ఉన్నాం, మాలో ఓ 10మంది చనిపోదాం అనుకుంటున్నాం అని కంట తడి పెట్టుకున్నారు. మాజీ స్పీకర్ శ్రీ యెనుమల రామ కృష్ణుడు, అతని సోదరుడు మరియు జిల్లా పరిపాలన వ్యవస్థ 2016 లో దివిస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి అంగీకరించామని మమ్మల్ని బల వంతం చేసిన కథను గ్రామస్తులు చెప్పారు. తరువాత జగన్ మోహన్ రెడ్డి గారు తమ మండలంలో బహిరంగ సభలో మాట్లాడుతూ "చంద్రబాబుకి బుద్ధి లేదు ఈ సున్నితమైన ఆక్వా జోన్‌లో ఈ కాలుష్య తయారీ యూనిట్‌ను ఎలా అనుమతిస్తారు? ఈ యూనిట్ 55లక్షల లీటర్ల కలుషిత నీటిని సముద్రంలోకి విడుదల చేస్తుంది. దానివల్ల చేపలు మరియు రొయ్యలు నశించిపోతాయి మరియు మీ గ్రామాల ప్రజలు జీవనోపాధిని కోల్పోతారు, మహిళలకు పిల్లలు పుట్టరు, ఇది మానవులతో (వివరాలు 3లో)

## రైతుల త్యాగాన్ని వృధా కానివ్వం : గుంటూరు జనసైనికులు



గుంటూరు ( జనస్వరం ) : రాష్ట్ర ప్రజల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని తమ భవిష్యత్తుని పట్టించుకోకుండా తమ వ్యవసాయ భూముల్ని ఇచ్చిన రైతులకు భవిష్యత్తు లేకుండా చేస్తుంటే జనసేన చూస్తూ ఊరుకోదు అని గుంటూరు జనసైనికులు హెచ్చరించారు. సంవత్సర కాలంగా శాంతియుత ప్రజాఉద్యమం చేస్తున్న రైతులకు అండగా రాష్ట్ర ప్రజలంతా ఉన్నారు. ఈ సందర్భంగా మూడు రాజధానుల విషయంలో ముఖ్యమంత్రి జగన్ మనసు మార్చి ... ఈ రాష్ట్రాన్ని కాపాడమంటూ శ్రీనివాసరావుతోటలోని స్వతంత్ర సమరయోధులు కన్నెగంటి హనుమంతు విగ్రహానికి జనసేన శ్రేణులు గురువారం వినతిపత్రం అందజేశారు. ( వివరాలు 4 లో )

## పేదలకు ఇళ్లస్థలాల పంపిణీ అసహనంగా మార్చిన వైసీపీ ప్రభుత్వం : జనసేన నాయకులు



ఏలూరు ( జనస్వరం ) : పట్టణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలను పట్టణానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో చొదిమెళ్ళ పంచాయతీ లక్ష్మీపురం గ్రామ శివార్లలో 142 ఎకరాలలో షుమారు 7 వేలమంది లబ్దిదారులకు ఇవ్వడానికి ప్రభుత్వం సన్నద్ధమైంది. ఒక్కొక్క లబ్ధిదారునికి ఒక సెంటు స్థలం మాత్రమే ఇవ్వడం చాలా దారుణమనీ, గత ప్రభుత్వాలు 5 సెంట్లు, 3 సెంట్లు, 2 సెంట్లు గా ఇవ్వడం జరిగిందనీ ఇది పేద ప్రజల పట్ల వైసీపీ ప్రభుత్వానికి ఉన్న వివక్షను తెలియజేస్తోందని ఏలూరు జనసేన పార్టీ ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు తెలియజేశారు. ఈ ఇళ్లస్థలాలలో నివసించేవారు కడుపేదరికంలో ఉండి రోజువారి కూలి చేసుకునేవారు కావడం, వీరు ఊరికి దూరంగా ఉండటం వల్ల జీవనోపాధి కోసం వారు పట్టణానికి రాలేక చాలా ఇబ్బందుల పాలవుతారని, సుమారు ( వివరాలు 4 లో )

## పవన్ కళ్యాణ్ గారి కృష్ణ జిల్లా పర్యటన ప్రమాదంలో గాయపడిన జనసైనికులకు రూ. 1,60,000 ఆర్ధిక సహాయం



కృష్ణా ( జనస్వరం ) : గత నెల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారి కృష్ణ జిల్లా పర్యటన సందర్భంగా పామర్రు దగ్గర ప్రమాదంలో క్షతగాత్రులైన పామర్రు నియోజకవర్గ జనసైనికులు గుమ్మడి వంశీ-కోట పవన్ తేజ కుటుంబాలకు NRI జనసేన టీం వారికి చికిత్స నిమిత్తం ఆర్ధికంగా 1 లక్ష 60 వేల సహాయం పామర్రు ఎలక్షన్ ఇంచార్జి తాడిశేట్టి నరేష్ గారి ఆధ్వర్యంలో వారి కుటుంబాలకు అందించడం జరిగింది. బాధితుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ జనసేన నాయకులు, జనసైనికులు అండగా ఉండటం అభినందనీయం అని అన్నారు. కార్యక్రమంలో నూజివీడు జనసేన నాయకులు పాశం నాగబాబు, పామర్రు జనసైనికులు రాము, కిరణ్, సుబ్బారావు నియోజకవర్గ జనసైనికులు పాల్గొన్నారు.

## నెల్లూరులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు




నెల్లూరు ( జనస్వరం ) : నెల్లూరు టౌన్ పరిధిలోని ఏసీ నగర్ లో దండరామపురం మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నందు జనసేన పార్టీ తరపున పూసల లక్ష్మీ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో న్యూ నెల్లూరు హాస్పిటల్ అధినేత డాక్టర్ P.బాలకోటేశ్వరరావు మరియు డాక్టర్ వేణుగోపాల్ డెంటల్ గార్లచే జనరల్ మెడిసిన్ మరియు పంటి సమస్యలను పరీక్షలు జరిపి 200మందికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. పూసల లక్ష్మీ మల్లేశ్వరరావు మాట్లాడుతూ జనసేన అధ్యక్షుడు శ్రీ పవన్ కల్యాణ్ గారి జనసేవ సూచనల మేరకు నగరంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశామన్నారు. నగరంలో అనారోగ్య సమస్యలు పెల్లుబికుతున్న వేళ ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడం కోసం జనసేన పార్టీ తరుపున క్యాంప్ నిర్వహించామన్నారు. డాక్టర్స్ మాట్లాడుతూ జనసేనాని అడుగుల్లో జనసేన నాయకులు నడవడం ఆనందదాయకం అని, జనసైనికుల సేవా స్ఫూర్తిని పొగిడారు.

## ఏలూరు నగర సమస్యల పరిష్కారానికై జనసేన పార్టీ ఆధ్వర్యంలో ధర్నా



ఏలూరు ( జనస్వరం ) : ఏలూరు పట్టణంలో స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం పెంచుతున్న ఆస్తిపన్నుల గురించి, పట్టణంలో మౌలిక సదుపాయాలైన రోడ్లు డ్రైనేజీల నిర్మాణం, మెయింటెనెన్స్ విషయాలపై మరియు మంచినీటి సరఫరా విషయంలో తలెత్తుతున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జనసేన పార్టీ ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పోరేషన్లలో మరియు మున్సిపాలిటీలలో పురపాలక చట్టం ఆస్తిపన్ను సవరణ బిల్లు 2020 ద్వారా, రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో కూడా ఆస్తి పన్నులను – రిజిస్ట్రేషన్ విలువ ప్రకారంగా ఇంటి పన్ను నిర్ధారణ చేసే చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాము. ఈవిధానంలో పన్నులు వేయడం ప్రజలపై పెనుభారాన్ని మోపినట్లేననీ, ఇది పూర్తి అసంబద్ధమైన జి.ఓ. అనీ, వార్షిక అద్దె విలువ ఆధారిత పన్ను నుండి ( వివరాలు 4 లో )

# ఓ ప్రజాస్వామ్యమా...
# నీ పయనం ఎటు ???

సంపాదకీయం



ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యదేశంగా వినుతికెక్కిన భారతదేశంలో ప్రజాస్వామ్యమనే మాట పాలకులకు వినరాని మాట అయింది. సమాజంలోని పౌరులంతా స్వేచ్ఛ, సమానత్వాలతో జీవించడానికి అనువైన సంవిధానంగా ప్రజాస్వామ్యాన్ని పరిగణిస్తారు. ఇది కేవలం ఒక భావనే తప్ప ఆచరణలో నిరూపితమైన సత్యం కాదు. అయినప్పటికీ ప్రజాస్వామ్యం గురించి అటు పాలకులు, ఇటు పాలితులు మాట్లాడుతుంటారు. న్యాయమైన, స్వచ్ఛమైన, నీతివంతమైన పాలన ప్రజాస్వామ్యం కల్పించదు. కానీ చట్టపరమైన హామీ ఇస్తుందనే భావనతో ప్రజాస్వామ్యం అభిలషణీయమైన వ్యవస్థగా భావిస్తున్నారు. అందువల్లనే ప్రజాస్వామ్యం గురించి, ప్రజాతంత్ర వ్యవస్థల గురించి నొక్కి చెబుతుంటారు. ప్రజాస్వామ్యం కన్నా అత్యున్నతమైన వ్యవస్థ సోషలిజం (సామ్యవాదం). సామ్యవాదం ఒక సుదూర స్వప్నం, ఆచరణసాధ్యం కాని ఆదర్శం అనే భావన పాతుకుపోయింది. కనుక కనీసం ప్రజాస్వామ్యం ఉంటే చాలని సర్దుకుపోయే ధోరణికి ఆమోదం లభించింది. అయితే ఇది కూడా మంట గలిసే రోజులు దాపురించాయి.

**స్వేచ్ఛావాణిజ్యకర్తల సిద్ధాంతం :**

తొలుదొలుత స్వేచ్ఛా వాణిజ్యకర్తలే ప్రజాస్వామ్యం గురించి పలికారు. ఎల్లలు లేని వాణిజ్య స్వేచ్ఛను ఆశించిన బూర్జువాల కోరికనే ప్రజాస్వామ్యం. స్వేచ్ఛ, సమానత్వం అనే మాటల వెనుక అంతులేని వాణిజ్య దాహం దాగివుంది. తాము కోరుకునే విశృంఖల వాణిజ్య సరళికి ఆమోదం లభించడం కోసమే సమానత్వం అనే మాటని జోడించారు. సమాజంలో అందరూ స్వేచ్ఛగా మసలుకునే వెసులుబాటు కావాలన్నారు. అందరికీ స్వేచ్ఛ అన్నది అభిలషణీయం. వినసొంపైన పదబంధం. అయితే సంపన్నులకీ, పేదలకీ ఒకేరకమైన స్వేచ్ఛ ఉంటుందా. ఉంటుందని నమ్మబలుకుతారు స్వేచ్ఛా సిద్ధాంతకర్తలు. ఎందుకంటే వారు 'పెట్టుబడి' స్వేచ్ఛా ప్రవాహానికి అనువైన మేధావులు. మరో మాటలో చెప్పాలంటే మార్కెట్ల సానుకూల ఆర్థికవేత్తలు. ఆస్తిహక్కు, సంపాదించే హక్కు, సంపదల్ని పోగు చేసే హక్కు వారికి అసలు సిసలు స్వేచ్ఛలుగా కనిపించాయి. ఆ స్వేచ్ఛకు జనుల ఆమోదం లభించాలన్న వ్యూహమే ప్రజాస్వామ్య సిద్ధాంతానికి మూలం.

**స్వేచ్ఛ ఎక్కడ? సమానత్వం జాడేది? :**

తన పంటని ఎక్కడయినా అమ్ముకునే స్వేచ్ఛ వంద ఎకరాల భూస్వామికీ, రెండు ఎకరాల సన్నకారు రైతుకూ ఒకేవిధంగా ఉంటుందనే మాట వినటానికి బాగుంటుంది. కానీ తన పల్లె పొలిమేరని దాటి పంటని తరలించే స్థోమత లేని రైతులకు దళారీలే దిక్కవుతారు. సకల వసతులున్న భూస్వామికే తప్ప రైతుకు వాణిజ్యస్వేచ్ఛఓఎండమావి. అలాగేరాయితీలతో, పలురకాల ఆకర్షణలతో వినియోగదారులని ఆకట్టుకునే మాల్స్ మాంత్రికుల ముందు చిల్లరకొట్లు గిరాకీ లేక చతికిలపడటం తెలిసిందే. చిల్లరకొట్టు యజమానికీ, మాల్స్ పెట్టుబడిదారునికీ ఒకేవిధమైన వాణిజ్యస్వేచ్ఛ ఉండటం మన ప్రజాస్వామ్య వ్యవస్థలోని సుగుణం అని చెబుతారు. అయితే అంతిమంగా బడా పెట్టుబడిదారుల స్వేచ్ఛ సామాన్యుల స్వాతంత్ర్యాన్ని, ఎంపిక స్వేచ్ఛనీ హరిస్తుంది. వాణిజ్య స్వేచ్ఛ కోసమే ప్రవచించిన ప్రజాస్వామ్యం ఏకస్వామ్యానికి దారితీసి, అది ఆర్థికవ్యవస్థనే కాదు రాజకీయ వ్యవస్థల్నీ గుప్పిట్లో పెట్టుకొని ఆడిస్తున్నది. దరిమిలా ప్రజాస్వామ్యం ఏ రూపం తీసుకున్నదో గత అయిదారేండ్ల పరిణామాలు స్పష్టంగా చెబుతున్నాయి.

**మౌలిక సూత్రాలకు తిలోదకాలు :**

ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకొనే ప్రభుత్వ విధానాన్ని ప్రజాస్వామ్యం అన్నారు అబ్రహం లింకన్. కానీ ప్రజల చేత ఎన్నికయిన ప్రభుత్వాలు చివరకు ప్రజాస్వామ్యాన్ని అనేకరూపాల అపహాస్యం పాల్జేస్తున్నాయి. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికయిన కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని 1959లో నెహ్రూ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేయడంతో మొదలయిన దాడి... అక్కడితో ఆగలేదు. ఆర్టికల్ 356 దుర్వినియోగానికి సంబంధించిన ఉదంతాలు అనేకం. ఫిరాయింపుల చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ బీజేపీ తమది సైతం కాంగ్రెస్ తరహా రాజకీయమని రుజువు చేసుకుంది. గత రెండేండ్లలో కర్నాటక, మధ్యప్రదేశ్‌లలో ఫిరాయింపుల్ని ప్రోత్సహించి, అక్కడి ప్రభుత్వాల్ని పడగొట్టడం తెలిసిందే. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల్ని కూలదోయడం సమంజసం కాదని రాజ్యాంగానికి కట్టుబడి నడుచుకునే పార్టీ భావించాలి. కానీ ఎక్కడికక్కడ తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలని తలపోస్తున్నందున ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వాల్నిపడగొట్టేందుకు బిడియపడటం లేదు.

**ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎన్నికయి...**

సర్వసత్తాక భారత రాజ్యాంగం, చట్టం ఇచ్చిన వెసులుబాటుతోనే ఆయా పార్టీలు అధికారంలోకి వస్తున్నాయి. అధికారం చేపట్టాక ప్రజాస్వామ్య సూత్రాల్ని విస్మరిస్తున్నాయి. ప్రజాతంత్ర పద్ధతుల్లో నడుచుకోవాల్సిన వ్యవస్థలపై దాడి చేస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీలే గాక అనేక ప్రాంతీయ పార్టీలు ఇదే ధోరణితో వ్యవహరించడం గమనార్హం. మెజారిటీ సీట్లతో అధికారంలోకి వచ్చాక సకల సంస్థలనూ గుప్పిట్లో పెట్టుకుంటారు. తమ మాటకు తిరుగుండరాదన్న ధోరణితో వ్యవహరించడం రివాజయింది. ప్రత్యామ్నాయ ఆలోచనలకు తావుండరాదన్న ధోరణి ప్రజాస్వామ్యానికి విఘాతం. చరిత్రని సైతం వక్రీకరించడాన్ని ఇందులో భాగంగా చూడాలి. ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తూ సామాజిక వ్యవస్థని మధ్యయుగాల కాలానికి నడిపించే ఈ కుతంత్రం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నియయిన ప్రభుత్వం చేపట్టడమే విరోధాభాస.

**ఏకపక్ష ధోరణి :**

మన దేశంలో ప్రభువులు పోయినా ప్రభుస్వామ్యం పోలేదు. ప్రజాతంత్ర వ్యవస్థలో ప్రజల తరపున అధికారం చేపట్టిన వారు ప్రజలకు బద్ధులయి ఉండాలి. అందుకు విరుద్ధంగా అపరిమితమైన అధికారం చెలాయిస్తూ తాము తలచిందే జరగాలన్నట్టుగా రాజుల్లా వ్యవహరిస్తున్నారు. రాజరికంలో మాదిరిగా ఏకపక్ష నిర్ణయాలతో ప్రజల్ని నానాయాతనలు పెడుతున్నారు. ప్రజాస్వామ్యం అంటే ఏమాత్రం గౌరవం లేని పాలకపార్టీల వ్యవహారసరళితో చదువుకున్నవారు విసిగెత్తిపోయారు. రాజకీయ వ్యవస్థ మీద విశ్వసనీయత కోల్పోయిన నేపథ్యంలో ఓటింగ్ శాతం తగ్గిపోతున్నది. అయితే కడుపు కాలినవారు, సమస్యలతో అల్లాడేవారు ప్రభుత్వాల్ని నిలదీస్తారు. తమ బతుకులతో చెలగాటమాడే పార్టీల, ప్రభుత్వాల దుర్మార్గాలపై గళం విప్పుతారు.

**ఏది ప్రత్యామ్నాయం?**

ప్రభుత్వాలు రాజ్యాన్ని నిరంకుశంగా వ్యవహరించడం ఒక్కరోజులో జరిగిన పరిణామం కాదు. అభివృద్ధి పేరుతో ఉదారవాద ఆర్థిక విధానాల్ని ఆమోదించడం, విశృంఖల వాణిజ్యానికి కార్పోరేట్లకు ద్వారాలు తెరవడం, ఫలితంగా క్రమేణా ప్రజాస్వామ్యం హరించుకుపోయింది. గ్లోబలైజేషన్ ప్రకంపనలు ఎంతటి విషపూరిత ఫలితాలనిస్తాయో, ప్రజల గొంతుకల్ని ఉత్తరించే దారుణాలకు ఒడిగడతాయో మొదటి నుంచీ ఈ దేశంలో కమ్యూనిస్టులు హెచ్చరిస్తున్నారు. తమ స్వరాలకు, గళాలకు చోటు నివ్వని మీడియాని పట్టించుకోకుండా ప్రజల్ని చైతన్యపరిచే కర్తవ్యంలో నిమగ్నమై ఉన్నారు. కానీ ప్రజల కోసం పనిచేసే కమ్యూనిస్టులకు బలం చాలదంటూ, వారిని ఆమోదించే ప్రజల్ని సైతం వారికి దూరం చేసే ధూర్తత్వం చెలామణీ అవుతున్నది. ప్రజల కోసం రాస్తున్నామని చెప్పే కవులు, గాయకులు సైతం ఈ అబద్ధాల వ్యూహాల్లో చిక్కుపడి పాలకవర్గాలతో గొంతు కలపడం మన కాలపు విషాదం. అయినప్పటికీ కాలం నిశ్చలంగా ఉండిపోదు. తమ ఓట్లతో అధికారంలోకి వచ్చి తమ బతుకుల్ని బలిపెట్టే ప్రజాస్వామ్య హంతక ధోరణుల్ని ప్రజలు క్షమించరు. దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ గళమెత్తి వీధుల్లోకి వచ్చే సమూహాలు ఈ విషయాన్నే చెబుతున్నాయి. నామమాత్రమైన ప్రజాస్వామ్యాన్ని సైతం కబళించే పాలకుల క్రౌర్యాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ ప్రశ్నలకి వెన్నుదన్నుగా నిలిచి ప్రత్యామ్నాయంగా నిలబడే వీరుల కోసం కాలం కలగంటున్నది. ఆ కలని నెరవేర్చే వీరులు ప్రజల్లోంచే వస్తారు. ప్రజలే చరిత్ర నిర్మాతలనే సత్యాన్ని రుజువు చేస్తారు. ఈ రుజువర్తనకు మార్గం సుగమం చేయడం, నిజమైన ప్రజాస్వామ్య ప్రేమికుల, ప్రజాపక్షం నిలిచే వ్యక్తుల, సంఘాల కర్తవ్యం.

**అవినీతి ఆకాశానికి తాకింది పారదర్శకత పాతాళానికి చేరింది :**

సంస్థ సర్వే కోసం ఏసియాలోని 17 దేశాల్లో 20,000 మంది ప్రజల అభిప్రాయాలు తీసుకున్నామని వివరించింది. ఇండియాలో లంచగొండితనం ఓ పెద్ద సమస్య అని, ప్రతి నలుగురిలో ముగ్గురు (75శాతం) నమ్ముతున్నారనీ, ప్రతి ఐదుగురిలో ఒకరు (22శాతం) లంచం ఇచ్చి ప్రభుత్వ సంబంధ పనులు చేయించుకుంటున్నారనీ సర్వేలో తేలింది. అవినీతిలో ఇండియా 39శాతం, తరువాత 37శాతంతో కాంబోడియా, 30శాతంతో ఇండోనేషియా ఉన్నాయి. అతి తక్కువ లంచగొండితనం ఉన్న దేశాల్లో 2శాతంతో జపాన్, 10శాతంతో దక్షిణ కొరియా, 12 శాతంతో నేపాల్ ఉన్నాయి. అవినీతి అధికారులను పట్టుకొని, దర్యాప్తు చేసి వెంటనే శిక్ష పడేలా కఠిన చర్యలు, నియమ నిబంధనలు చేపడితే లంచగొండితనం తగ్గుతుందని సూచిస్తున్నారు. సంస్థ సర్వే ప్రకారం కరప్షన్ పర్సెప్షన్ ఇండెక్స్ జాబితాలో 180దేశాల్లో భారత్ 80వ స్థానంలో ఉన్నదని తేలింది. ఇండియాలో అవినీతి చెదలును అదుపు చేయడానికి ప్రతి ఒక్క బాధ్యతగల భారతీయుడు సహకరించాలని, అవినీతిపరులను సత్వరమే కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వ కార్యాలయాలు స్వచ్ఛంధ సేవా కేంద్రాలుగా రూపాంతరం చెంది సామాన్యుల పక్షపాతిగా మారాలని ఆశిద్దాం. లంచగొండితనమనే భూతాన్ని పొలిమేరలు దాటేదాకా తరిమేద్దాం.

అధికారాన్ని నిలబెట్టుకోదానికి చాలా దేశాలలో రాజకీయ నాయకులు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే విధానాలను అనుసరిస్తున్నారని ప్రొఫెసర్ టామ్ గిన్స్‌బర్గ్ చెప్పారు. రాజ్యాంగ సవరణలు చేయడం, ప్రభుత్వంలోని ఇతర విభాగాలలో జోక్యం చేసుకోవడం, బ్యూరోక్రసీని తన నియంత్రణలో పెట్టుకోవడం, పత్రికా స్వేచ్ఛకు అంతరాయం కలిగించడం, ఎన్నికలను ప్రభావితం చేయడంవంటివి వీటిలో కొన్ని.

ఓ ఓటరా... ప్రజాస్వామ్యంలో నీకున్న హక్కుని వినియోగించుకో. పోరాడు. అవసరం అయితే తిరగబడు. మౌనంగా మాత్రం ఉండకు...

By
చంద్రశేఖర్
ట్విట్టర్ ఐడి : @chandrasekarJSP

దివీస్ వ్యతిరేక పోరాట సమితికి అండగా నిలుస్తాం

( మొదటి పేజీ తరువాయి )

పాటు సముద్ర జీవులకు కూడా ప్రమాదం కలిగిస్తుంది” అన్నారు. అతనిని విశ్వసించి 2019లో ఆయనకు ఓటు వేశారు, కానీ జగన్ మోహన్ రెడ్డి గారు సీయం అయ్యాక , తన వాగ్దానం మరచిపోయి పోలీసుల శక్తితో తొందంగిలో ఆ విషపు యూనిట్‌ను ఏర్పాటు చేయమని దివీస్ ను ప్రోత్సహిస్తున్నాడు. ఇది దారుణం అన్నారు. తల్లి పాలు త్రాగి రొమ్ము గుద్దినట్టే అని వాపోయారు. ఆ గ్రామం నుంచి వచ్చిన శ్రీమతి నాగ కృష్ణవేణి “జగన్నన్నా నా నెత్తిమీద చెయ్యి వేసి ప్రమాణం చేసావు, ఈ విషం కక్కే ఫ్యాక్టరీని బంగాళాఖతంలో కలిపేస్తానన్నావు.. మర్చిపోయావా, నీ స్పీచ్ ఒకసారి చూడు గుర్తు తెచ్చుకో మాకు న్యాయం చెయ్యి.. ఫ్యాక్టరీని వదిలి మమ్మల్ని బంగాళాఖతంలో కలపక” అని రోదించింది.

రైతులను ఉద్దేశించి జనసేన ప్రధాన కార్యదర్శి శ్రీ తమ్మిరెడ్డి శివశంకర్ మాట్లాడుతూ GO నెంబర్ 1307 / 23.12.1993 ప్రకారం, D పట్టా భూములను ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల కోసం మాత్రమే తీసుకోవచ్చు, కేటాయించిన భూములకు పరిహారం చెల్లించే విధానం కూడా ఉంది. అలాకాకుండా జులుం చేస్తే జనసేన వారికి అండగా ఉంటుంది. ఈ గ్రామాలన్నిటి జీవనోపాధిని కాపాడటానికి మరియు ఆ ప్రాంతంలో జల జీవనాధారాలను కాపాడటానికి అన్ని చట్టపరమైన సహాయం చేస్తుంది, ఈ జోన్‌ను ఆక్వా జోన్‌గా ప్రకటించే వరకూ వారి తరపున పోరాడతానని ఆయన తోండంగి మండల గ్రామస్తులకు కాలుష్యరహిత సముద్ర సంబంధిత యూనిట్లు మాత్రమే అక్కడ ఏర్పాటు చేయబడతాయి హామీ ఇచ్చారు. జనసేన పర్యావరణ కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, భీమిలిలో ఉన్న దివిస్ యూనిట్ ఇప్పటికే సముద్ర జీవులకు, మత్స్యకారుల జీవనోపాధికి ముప్పుగా మారిందని, క్రమబద్ధీకరించని కాలుష్యంతో 16 గ్రామాలు ప్రభావితమయ్యాయని చెప్పారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ సైంటిస్ట్ కూడా ఈ పరిశ్రమల ద్వారా సముద్రపు నీటి కాలుష్యంతో లక్షలాది కోట్ల నష్టం సముద్ర జీవులకు సంభవించిందని ధృవీకరించారు. అందువల్ల, కాలుష్య నియంత్రణ మండలి విధించిన షరతులకు వారు కట్టుబడి ఉన్నారని రుజువైనంతవరకు, దివీస్ నుండి మరిన్ని యూనిట్లను అనుమతించకూడదు, వైజాగ్ మరియు హైదరాబాద్ లోని వారి యూనిట్లకు కాలుష్యంపై ఆడిట్ జరగాలి అన్నారు. మరియు ఆగష్టు 11, 2018 న తన ప్రసంగంలో తోండంగి మండల ప్రజలకు ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలని మేం శ్రీ జగన్ మోహన్ రెడ్డిని కోరుతున్నాము మరియు దివీస్ ఫార్మా సిటీ విశాఖపట్నానికి మార్చండి మరియు తోండంగి మండలాన్ని ప్రకటించండి “ఆక్వా జోన్” లేకపోతే, భారత రాజ్యాంగం ప్రకారం పర్యావరణం మరియు మానవ హక్కులను పరిరక్షించాల్సినఅవసరంమాపైఉందిదాన్నిమేం పరిరక్షిస్తాం అన్నారు. మీరు మాటపై నిలబడేలా, మాటకు కట్టుబడి ఉండేలా చేస్తాము అన్నారు.

యూనిట్ యొక్క EC యొక్క పరిస్థితులకు సంబంధించి తమ వద్ద ఉన్న అనుమతులను పరిశీలిస్తున్న మీడియాకు ప్రధాన కార్యదర్శులు మరియు వారు CRZ, అటవీ చట్టాలను ఎలా ఉల్లంఘించగలరు? ఏ నిబంధనల ప్రకారం అనుమతించదగని అన్నారు. ఈ సముద్ర కాలుష్య యూనిట్ నిర్మాణాన్ని ఎలా చేస్తారు? ఎలా అనుమతినిస్తారు? అని ఛాలెంజ్ చేశారు. ఈ కార్యక్రమంలో తోండంగి మండలం రైతుల బృందం, కాకినాడ జనసేన నాయకులు మధు విరేష్, అమలాపురం జనసేన నాయకులు ఆర్ డి ఎస్ ప్రసాద్, జనసైనికులు మండల ప్రజలు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఇళ్ళు: జనసేన నాయకుల సహాయం



విజయనగరం ( జనస్వరం ) : విజయనగరం జిల్లా సాలూరు మండలం నెలిపర్తి గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్ళు కాలిపోయి 3 కుటుంబాలు రోడ్డున పడ్డారు. వారికి ఆసరాగా జనసేనపార్టీ ఆధ్వర్యంలో బియ్యం, పప్పు, పంచదార, కూరగాయలు ఇచ్చి ఆ కుటుంబాలను ఓదార్చారు. ఇంచార్జ్ రేగు.మహేశ్వరరావు గారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని మానవత్వంతో ప్రతి ఒక్కరూ ఆదుకోవడం మానవులుగా ముఖ్య కర్తవ్యమని అన్నారు. కార్యక్రమంలో సాలూరు జనసేన పార్టీ ఇంచార్జ్ రేగు.మహేశ్వరరావు గారు మరియు పార్టీ నాయకులు శివ, సంతోష్ కుమార్, మురళి, జ్యోతిప్రకాష్, చంటి, వంశీ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్య కోసం పోరాటం చేసి విజయం సాధించిన జనసేన నాయకులు సుందరపు విజయ్ కుమార్



విశాఖపట్నం ( జనస్వరం ) : రహదారులకు మరమ్మత్తులు చేయాలనే డిమాండ్ తో ప్రత్యేక ఆర్థిక మండలి ( సెజ్ ) కేంద్రంలో జనసేన ఉత్తరాంధ్ర జిల్లా కన్వీనర్ సుందరపు విజయ్ కుమార్ చేపట్టిన దీక్ష శుక్రవారం విరమించారు. గురువారం ఉదయం ఆయన అచ్యుతాపురం కూడలిలో మెరుపు ఆందోళనకు దిగారు. పనులు ప్రారంభించే వరకూ కదిలేది లేదంటూ రాత్రంతా కూడలిలోనే కూర్చుండిపోయి ఆందోళన కొనసాగించారు. శుక్రవారం సాయంత్రం ఆర్ అండ్ బీ ఎస్సై కేశవరావు, ఎలమంచిలి డీఈ విద్యాసాగర్ అచ్యుతపురానికి వచ్చి ఆయనతో చర్చించారు. ముందుగా అచ్యుతాపురం–రామన్నపాలెం రోడ్డులో మరమ్మత్తులు చేపట్టడానికి జేసిబిని రప్పించిన అధికారులు పనులు లాంఛనంగా ప్రారంభించినట్లు ప్రకటించారు. సెజ్ కంపెనీలు, పోలీసులు, ఏపీఐఐసీ అధికారులతో సోమవారం ఏర్పాటు చేసి మిగిలిన ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేయడానికి కార్యచరణ రూపొందిస్తామని అధికారులు ప్రకటించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసి నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు అగ్గాల హనుమంతరావు సంఘీభావంగా దీక్ష కొనసాగించారు. ఏపీఐఐసీ ఛైర్ పర్సన్ రోజా పవన్ కళ్యాణ్, చంద్రబాబులను విమర్శించడం మాని వేలాదిమంది ఉద్యోగులు తిరిగే రోడ్లు బాగు చేయడంపై దృష్టి పెట్టాలని కోరారు. అంతకముందు జనసేన నాయకులు కోన తాతారావు గారు దీక్ష చేస్తున్న సుందరపు విజయ్ కుమార్ గారిని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరికి ఏం సమస్య వచ్చినా ముందుగా జనసేన పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

## చేనేత కార్మికులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి : గునుకుల కిషోర్



నెల్లూరు ( జనస్వరం ) : నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం పాటూరు గ్రామం మరియు నెల్లూరు రూరల్ నారాయణరెడ్డి పేట లో ఉంటున్న చేనేత కార్మికుల కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా నాయకులు కిషోర్ గునుకుల గారు. కన్ను,కాలు,చెయ్యి అవయవాలన్నీ ఏకాగ్రతతో పనిచేస్తే గానీ ఒక రోజుకి ఒక చీరని కూడా తయారుచేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇద్దరు కలిసి పని చేస్తే రోజుకి 500 వందలు కూడా రాని దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా, మారని వారి జీవన ప్రమాణాలు. ఇదే పరిస్థితి కొనసాగితే భారత సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిన చేనేత రంగం పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి. ఆ రంగంలో ఉన్న కార్మికులు ఎవరూ తన తర్వాతి తరాన్ని ఆ రంగంలో నైపుణ్యాన్ని నేర్పించి ఆ రంగంలో ఉంచాలి అనుకోవడంలేదు. ఆసామి దగ్గర ముడిసరుకు తెచ్చుకొని ఆసామి దగ్గర కూలి పొందడం తప్ప వారికి వేరే మార్గం లేదు. ప్రభుత్వం వెంటనే ఆదుకొని ముడి సరుకులు రుణ సదుపాయం కలగజేసి చేనేత నేసిన వారే స్వయంగా మార్కెట్లో అమ్మే పరిస్థితి తీసుకు వచ్చేటట్లు, కరోనా మహమ్మారి వలన 9 నెలలు మరియు భారీ వర్షాల కారణంగా పనుల్లేక పూర్తిగా కరువు సమస్యలు ఎదుర్కొంటున్న వారి జీవన విధానాన్ని అధినేత పవన్ కళ్యాణ్ గారికి దృష్టికి సమాచారం అందించి చేనేత కార్మికులకు అండగా జనసేన పార్టీ నిలుస్తుందని అన్నారు.

## ఆత్మ హత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబంకు జనసేన పార్టీ ఆర్థిక సహాయం



కృష్ణా ( జనస్వరం ) : అవనిగడ్డ మండలం మోదుముడి గ్రామానికి చెందిన ఓలేటి ఆదిశేషు(60) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. 7 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని పంట వేయగా, నివర్ తుఫాన్ ధాటికి పంట మొత్తం దెబ్బతిని మొలకలు వచ్చాయని, పొలంలో చల్లిన మినుము విత్తనాలు కూడా మొలకెత్తలేదని, చేసిన అప్పులు(సుమారు 3 లక్షలు) తీర్చలేక పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నియోజకవర్గ ఇంచార్జి శ్రీ ముత్తంశెట్టి కృష్ణారావు గారి దృష్టికి రావడంతో వెంటనే స్పందించి చనిపోయిన కౌలు రైతు కుటుంబంకు జనసేన పార్టీ తరుపున 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆ కుటుంబానికి జనసేన పార్టీ, జనసైనికులు సహాయంగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చెయ్యండి : రైల్వే కోడూరు జనసేన నాయకులు



కడప ( జనస్వరం ) : నివర్ తుఫాను కారణంగా రైల్వేకోడూరు చుట్టూ ప్రవహిస్తున్న ఏరులు పొంగి పొరలి ప్రవహించి అక్కడక్కడ సుడిగుండాలు ఏర్పడి ఖచ్చితమైన లోతు తెలియని గుంతలు నీటితో నిండి ఉన్నాయి. ఈ మధ్య వరుస ఘటనలలో ఇద్దరూ యువకులు ప్రాణాలను కోల్పోవడం జరిగింది. గతంలో ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తరిలించారు. అవి కాస్త ఇప్పుడు మృత్యుకూహరాలు లా మారి పిల్లల ప్రాణాలు నీ బలి తీసుకుంటున్నాయి. కావునా జరగాల్సిన నష్టం జరిగిపోయాక నష్ట నివారణ చర్యలను చేపట్టడం అంటే ముందస్తుగా ప్రమాదాలను నివారించేందుకు ప్రమాద స్థలాలను గుర్తించి బోర్డులను ఏర్పాటు చేయవలసిందిగా డిప్యూటీ మండల రెవెన్యూ అధికారి అయినా శివరాం గారికి జనసేన పార్టీ కార్యకర్తలువినతిపత్రాన్నిఅందించడంజరిగింది.

## పేదలకు ఇళ్లస్థలాల పంపిణీ అసహనంగా మార్చిన వైసిపి ప్రభుత్వం

( మొదటి పేజీ తరువాయి )

సుమారు 25 వేల మంది ప్రజలు నివసించబోయే ఈ ప్రాంతానికి విద్యా వైద్య సదుపాయాలు, రవాణా సౌకర్యాలు వంటి మౌలిక వసతులను కల్పించకుండా స్థలాలను ఇవ్వడం చాలా దారుణమని, ముఖ్యంగా ఉచితంగా ఇస్తున్న ఈ ఇళ్ల స్థలాలు పల్లపు భూముల్లో ఉండటం, వాటికి కరెంటు, రోడ్లు, డ్రైన్లు, మొదలగు సదుపాయాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడం, అక్కడ నిర్మించే ఇళ్లకు బేస్మెంట్ లు ఎత్తుగా లేకపోవడంతో చిన్న వానకి మునిగిపోయే అవకాశాలు ఉండటం, నిర్మించబడిన ఇళ్ళల్లో నాణ్యత లోపించడంతో అలాంటి స్థలాలు నివాసయోగ్యం కాక నిరుపయోగంగా మారిపోతున్నాయని రెడ్డి అప్పలనాయుడు తెలియజేశారు.

ఇక్కడ ఈ ప్రభుత్వం తానేదో ఘనత సాధించానని చెప్పుకోవడానికి ఒకేసారి 25 లక్షల ఇళ్లస్థలాలు పంచాలని అనుకుంటుంది కానీ, తాను ఇచ్చే సెంటు స్థలం ఎందుకూ పనికిరాని స్థలంగా ఉంటుందన్న విషయాన్ని మాత్రం గుర్తించడం లేదు. కనీసం ఒక కుటుంబం నివసించడానికి రెండు సెంట్లు స్థలాన్ని కేటాయించవలసి ఉంటుందని, నిర్మించే ఇండ్లకు కనీసం మూడు అడుగుల బేస్మెంట్ ఉండాలనీ, తక్కువ ధరలో నిర్మిస్తే దానికి తగినంత నాణ్యత లోపిస్తుంది కనుక నిర్మించే ఇంటి యొక్క ఖరీదు సుమారుగా 5 లక్షలు గా ఉండాలని, నివాసయోగ్యం కి కావలసిన అన్ని ప్రమాణాలను పాటించాలని జనసేన పార్టీ డిమాండ్ చేస్తోంది. గతప్రభుత్వం ఇలాగే (టిడ్కో) ఇళ్లను నిర్మించి ఇస్తామని చెప్పి ప్రజల వద్ద నుంచి డబ్బులు తీసుకుని కూడా ఇంతవరకు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు చాలా అవస్థలు పడుతున్నారు కనుక ముందుగానే ప్రభుత్వం ఇస్తున్న ఈ ఇండ్ల స్థలాలు ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నాయి, సరైన మౌళిక సదుపాయాల కల్పన జరిగిందా, లేదా అనేది తెలుసుకోవడానికి జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏలూరు ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు తన సహచర నాయకులూ నగర అధ్యక్షుడు కాశీ నరేష్, మండల అధ్యక్షుడు వీరంకి పండు, బొత్సా మధు, ఒబిలిశెట్టి శ్రావణ్, సరిది రాజేష్, గుబ్బల నాగేశ్వరరావు, అంజనేయులు, నాగభూషణం, కుమార్, ఆర్కే, ధర్మేంద్ర, జనసేన రవి, గంగరాజు, చిరంజీవి, దుర్గారావు తదితర కార్యకర్తలతో పరిశీలించడం జరిగింది.

## ఏలూరు నగర సమస్యల పరిష్కారానికై జనసేన పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

( మొదటిపేజీ తరువాయి)

ఆధారిత పన్ను నుండి ఈ విధమైన పన్ను విధానంలోకి మార్చడం వల్ల దాదాపుగా 30 రెట్లు అధికంగా ప్రజలపై భారం పడే అవకాశం ఉంది. కనుక దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని జనసేనపార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందని రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. అంతేకాక గత 9 నెలలుగా కరోనా కారణంగా ఉపాధి కోల్పోయి జీవనం సాగించలేని పరిస్థితిలో ప్రజలు ఉన్న సమయంలో ఈ యొక్క పన్నుల పెంపు నిర్ణయం ప్రజలపై పెనుభారంగా మారుతుంది. కావున అధికారులు ప్రభుత్వం ప్రజల యొక్క బాధను అర్థంచేసుకొని పాత పన్నుల విధానాన్ని కొనసాగించాలని కొత్తగా తయారు చేసిన చట్టాన్ని ఉపసంహరించు కోవాలని, లేకుంటే ప్రజోపయోగాల కోసం ఉద్యమాన్ని చేపట్టడం జరుగుతుందని జనసేనపార్టీ హెచ్చరిస్తోంది.

అంతేకాక ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ లో దాదాపు 60, 70 సంవత్సరాల నుంచి ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీల పూడిక తీసి నూతన నిర్మాణం చేయాలనీ, పట్టణ తాగునీటి అవసరాల కోసం కృష్ణ, గోదావరి కాలువల నుండి తాగునీటి జలాలని నిలువ చేసే పంపుల చెరువును శుద్ధి చేసి, దానిలో వ్యర్థపదార్థాలు పడనివ్వకుండా చెరువు చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేయాలనీ కోరారు. అలాగే దానికి సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేసి, ఏలూరు నగర ప్రజలకు కృష్ణా, గోదావరి నీటిని పరిశుభ్రం చేసి అందించి, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా రక్షించాలని ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఏలూరు నగరంలోని కుళాయి పంపుల కనెక్షన్లు , డ్రైనేజిలలో నుంచి కాకుండా పక్కనుంచి పైప్ లైన్ వేసి అలాగే కుళాయికి రక్షణగా కుండీలు నిర్మాణం చేయాలి. అలాగే ఓవర్ హెడ్ ట్యాంకులు టైం ప్రకారంగా క్లీనింగ్ చేసి మోతాదు ప్రకారంగా బ్లీచింగ్, క్లోరిన్ వంటి శాస్త్రీయమైన వాటితో శుద్ధి చేసి మంచి నీటిని సరఫరా చేయవలిసిందిగా ఏలూరు నగర కార్పొరేషన్ కమిషనర్ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రాన్ని అందించడం జరిగిందని ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ రెడ్డి అప్పలనాయుడు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాటం చేస్తాం — జనసేన నాయకురాలు శ్రీ కాంతి శ్రీ



శ్రీకాకుళం ( జనస్వరం ) : ఎచ్చెర్ల నియోజకవర్గంలో గుడిదాం పంచాయతీ వేణుగోపాలపురం "మనఊరు - మనసేన" 2వ కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయిలో జనసేన పార్టీని బలోపేతం చేయడం మరియు క్రియాశీలక సభ్యత్వం, పార్టీ సిద్ధాంతాల గురించి వివరించడం జరిగింది. గ్రామ ప్రజలు మాట్లాడుతూ అనేక సమస్యలుతో ఇబ్బందులు పడుతున్నారు అని తెలిపారు. ముఖ్యంగా కొన్ని సంవత్సరాలుగా రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనసేన వీర మహిళ శ్రీ కాంతి శ్రీ గారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎవరికి ఏం సమస్య వచ్చినా ముందుగా అండగా ఉండేది జనసేన పార్టీ అన్నారు. పార్టీ ఓడిపోయినా ప్రజల సమస్యలను తీర్చడానికి అండగా ఉంటుందన్నారు.

## మైలవరం ఇంచార్జ్ అక్కల రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో జనసేన పార్టీలోకి చేరికలు



మైలవరం ( జనస్వరం ) : మైలవరం నియోజకవర్గం జనసేన పార్టీ మైలవరం మండల కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మైలవరం మండల కమిటీ ఏర్పాటు గురించి మైలవరం మండలంలోని కార్యకర్తలతో మైలవరం నియోజకవర్గ ఇంచార్జి మరియు రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ అక్కల రామ్మోహన్ రావు (గాంధీ) గారు చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అక్కల గాంధీ గారు మండల కమిటీ గురించి అలాగే గ్రామ కమిటీల గురించి చాలా బాగా మాట్లాడారు. అలాగే ఈ కార్యక్రమంలో వెల్వడం నుండి కుందేటి కళ్యాణి గారు, చంద్రల నుండి దద్దణాల చంద్ర కుమారి గారు జనసేన పార్టీ సిద్ధాంతాలు, నాయకుడి మీద నమ్మకంతో జనసేనపార్టీలోకి రావటం చాలా సంతోషంగా ఉందన్నారు. వారి ఇరువురిని అక్కల రామ్మోహన్(గాంధీ) గారు పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు మరియు వీరమహిళలు, మండల నాయకులు ఉదయ్ బ్రహ్మం, మురళికృష్ణ, రాయుడు, రమేష్, శశికళ జయరాజు, చిరంజీవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పెందుర్తిలో " జనబాట " కార్యక్రమం ప్రారంభం : జనసేన నాయకులు వబ్బిన జనార్దన శ్రీకాంత్



విశాఖపట్నం ( జనస్వరం ) : విశాఖపట్నం 88 వార్డ్ పెందుర్తి నియోజకవర్గం విశాఖపట్నం జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారి స్ఫూర్తితో జనరల్ సెక్రెటరీ శ్రీ తమ్మిరెడ్డి శివశంకర గారి ఆధ్వర్యంలో జనబాట ప్రజా శ్రేయస్సే ముఖ్యం గెలుపే మార్గం అనే కార్యక్రమం ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకొని వారి సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకొని, రాబోయే రోజుల్లో పవన్ కళ్యాణ్ గారి నాయకత్వం బలపడేలాగా వార్డ్ లో జనసేన పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రజల్లో చైతన్యం చేసే కార్యక్రమం మొదలు పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అభ్యర్థి శ్రీ వబ్బిన జనార్దన శ్రీకాంత్ గారు మాట్లాడుతూ వార్డ్ లో ప్రజలు చాలా సమస్యలతో ఉన్నారని ఓటు వేసి గెలిపించిన వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్ గారు గ్రామాలను సందర్శించిన మానేసి రూమ్ కి పరిమితమయ్యారని ఆరోపించారు. అటు ప్రతిపక్షం కూడా ప్రజలను పట్టించుకోకపోవడం లేదు. గొప్పగా చెప్పుకొనే వాలంటరీ వ్యవస్థ కూడా ప్రజా సమస్యలు తీర్చడంలో వైఫల్యం చెందారని అన్నారు. ప్రజలు దగ్గరికి వెళ్లి మాట్లాడుతున్నప్పుడు చాలా సమస్యలు వాటర్ కార్డ్, రేషన్ కార్డ్, వీధిలైట్లు డ్రైనేజీ సమస్యలు, రోడ్లు, ఇలా చాలా సమస్యలు మాతో పంచుకోవడం జరిగిందని చెప్పారు.

## రైతుల త్యాగాన్ని వృధా కానివ్వం

( మొదటి పేజీ తరువాయి )

జనసైనికులు మాట్లాడుతూ నాడు అసెంబ్లీలో జగన్ గారు అమరావతి రాజధానిగా అంగీకరింపజేసి, 33 వేల ఎకరాలు అవసరమని అంగీకరించారు. ఈరోజున అధికారం చేపట్టిన తరువాత ఒక నియంతలా వ్యవరిస్తూ ఆ రోజు అంగీకరించిన నిర్ణయాన్ని ఈ రోజు మార్చడం తమ పతనానికి దారి తీస్తుందని అన్నారు. ఈ కార్యకరమంలో బందారు రవీంద్ర కుమార్, ఆళ్ళ హరి, కాశీ విశ్వనాథ్, ప్రసాద్, అన్వేష్ మాదాసు తదితర జనసైనికులు పాల్గొన్నారు.

## వైసీపీ కార్యకర్తల కోసమే నవరత్నాలు, పేదలందరికీ ఇల్లు : జనసేన నాయకులు డాక్టర్ యుగంధర్ పొన్న



నెల్లూరు ( జనస్వరం ) : కార్వేటినగరం మండలం, ఆర్ కే వి బి పేట గ్రామపంచాయతీ, కలికిరి లో గ్రామంలో నవరత్నాలు పేదలందరికీ ఇల్లుపథకం ద్వారా మండల అధికారులు గుర్తించిన లబ్దిదారులు మొత్తం 11 మంది అయితే అందులో నిజమైన లబ్ధిదారులు ముగ్గురు అనర్హులు ఎనిమిది మంది ఉన్నారని నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ యుగంధర్ పొన్న తెలిపారు. 50 ఇల్లు నివాస ప్రాంతంగా కలిగిన ఈ గ్రామంలో అనర్హులు 8 మంది ఉంటే, పెద్ద పెద్ద గ్రామాలు, మేజర్ పంచాయతీ కలిగిన గ్రామాలలో, 6 మండలాల్లో ఇంకా ఎంతమంది అనర్హులు ఉండాలి ? ఎవరికోసం ఈ బినామీ ఇల్లు? నిజమైన నిరుపేదలను, అణగారిన ప్రజలను, ఎస్సీ,ఎస్టీ, బిసి,ఓసి,క్రిస్టియన్,మైనారిటీ ముస్లిం మైనారిటీ వర్గాలలోని నిరుపేదలను వదిలిపెట్టి స్థానిక అధికార పార్టీ నాయకుల కు దాసోహమై అనర్హులను ఎంపిక చేయటం చాలా దారుణం అని అన్నారు. ఈ చర్యను జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్థానిక నాయకులకు, మంత్రులకు భయపడి పనిచేయటం మానాలని నిరుపేదల పక్షాన నిలబడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు, జనసేన నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన ప్రెస్ నోట్స్

### ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి సరైన ఆలోచనా దృక్పథం లేకపోవడమే ఏలూరు దుర్ఘటనకు కారణమని జనసేన పార్టీ రాజకీయ. వ్యవహారాల కమిటీ ఛైర్మన్ శ్రీ నాదెండ్ల మనోహర్ గారు అభిప్రాయపడ్డారు. ఆరోగ్యశాఖ మంత్రి నియోజకవర్గంలో కనీసం శానిటైజేషన్ కూడా సక్రమంగా లేకపోవడం చాలా బాధాకరమన్నారు. విశాఖ ఎల్జీ పాలిమర్స్ ఘటనలో ఏ విధంగా బాధితులకు న్యాయం చేశారో... ఏలూరు మిస్టరీ వ్యాధి బాధితులకు కూడా అదే విధంగా న్యాయం చేయాలని డిమాండ్, చేశారు. శనివారం ఉదయం ఏలూరు పట్టణంలో పర్యటించి అంతుబట్టని అనారోగ్య సమస్యలతో బాధితులైనవారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ధైర్యంగా ఉండాలని చెప్పారు. నగరంలో అధ్వాన్నంగా ఉన్న డ్రైనేజీలను పరిశీలించారు. అనారోగ్య సమస్యలతోఇబ్బందిపడుతున్న భానుప్రసాద్ అనే యువకుడికి ఆర్థిక సహాయం చేశారు.

అనంతరం జరిగిన మీడియా సమావేశంలో శ్రీ నాదెండ్ల మనోహర్ గారు మాట్లాడుతూ... "ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే ఈ దుస్థితికి ప్రధాన కారణం. 21 మంది సభ్యులతో కమిటీ వేసి ముఖ్యమంత్రి గారు చేతులు దులుపుకున్నారు. పురుగు మందుల అవశేషాలు ఉన్నాయని కొంతమంది, రక్తంలో సీసం ఉందని మరికొందరు నివేదికలు ఇవ్వడం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఇప్పటి వరకు వ్యాధి ప్రబలడానికి అసలు కారణం ఎవరికీ తెలియదు. పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు ముగ్గురు డాక్టర్ల బృందాన్ని అక్కడికి పంపించారు. వీరు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నప్పుడే తెలిసింది... మురుగు కాలువలు కూడా ఈ సంఘటనకు ఓ కారణం అని. అటు తర్వాతే శుభ్రం చేస్తున్నారని స్థానికులు మా దృష్టికి తీసుకొచ్చారు. ఆరోగ్యశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి అయిన శ్రీ ఆళ్ళ నాని నియోజకవర్గంలో ఇటువంటి పరిస్థితి ఉండటం చాలా బాధాకరం. చక్కని పాలన అందిస్తారనే ప్రజలు 151 మంది ఎమ్మెల్యేలను గెలిపించారు. ముఖ్యమంత్రిలో నాయకత్వ నైపుణ్యం, పాలన దక్షత రెండూ లోపించాయి.

#### 100 ఏళ్లనాటి పైపులైన్లే ఇప్పటికీ :

ఏలూరులాంటి గొప్ప పట్టణంలో శానిటేషన్ ఎంత అధ్వానంగా ఉందో ఇవాళ వార్డుల్లో తిరిగాక తెలిసింది. 100 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లే ఇప్పటికీ వాడుతున్నారు. మురుగునీరు మంచినీటి కాలువల్లో కలిసిపోతున్నాయి. ఐదు కుటుంబాలతో మాట్లాడాం. అందరిలో ఒకటే అయోమయ పరిస్థితి. డాక్టర్లు వస్తున్నారు, మందులు ఇస్తున్నారు తప్ప వ్యాధి ఎలా ప్రబలిందో ఎవరి దగ్గరా పూర్తిస్థాయి సమాచారం లేదు. ప్రభుత్వం కూడా సమస్యను చిన్నదిగా చూపించి అందరిని పక్కదారి పట్టించింది. మంగళగిరి నుంచి వచ్చిన ఎయిమ్స్ బృందం ఈ ప్రాంతంలో పర్యటించి.. వ్యాధులు ప్రబలినప్పుడు పాటించాల్సిన మెడికల్ ప్రోటోకాల్ పాటించలేదని చెప్పింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా అన్ని రకాల పరీక్షలు చేయాలని సూచించింది. కానీ ఎక్కడా అమలు కావడం లేదు. ముఖ్యమంత్రి గారు ఈ ప్రాంతంలో అరగంట తిరిగి వెళ్లిపోతేబాధితులకు ఏ విధంగా లాభముంటుందో ఆయనే చెప్పాలి.

#### ఓ ఎల్జీ పాలిమర్ బాధితుల మాదిరిగానే ఆదుకోవాలి :

ఏలూరు పట్టణంలో పర్యటించి, వ్యాధిబారిన పడి కోలుకున్న బాధితులతో మాట్లాడాం. వ్యాధి నుంచి కోలుకున్నాక కూడా నీరసం తగ్గడం లేదని, పనులకు వెళ్లలేక కుటుంబ పోషణ భారంగా మారిందని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం కూడా అందలేదని చెబుతున్నారు. విశాఖ ఎల్జీ పాలిమర్స్ దుర్ఘటనలో ప్రభుత్వం ఎలా స్పందించి బాధితులకు కోటి రూపాయలు నష్టపరిహారం అందించిందో... ఇప్పుడు కూడా ప్రభుత్వమే బాధ్యత తీసుకొని బాధితులను ఆదుకోవాలి. ప్రైవేటు సంస్థ తప్పు చేస్తే నష్టపరిహారం కింద ప్రతి ఒక్కరికి కోటి రూపాయలు ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడెందుకు మాట్లాడటం లేదు. ముఖ్యమంత్రి గారు బాధ్యత తీసుకొని బాధితులకు అండగా నిలబడాలి. పాలిమర్స్ తరహాలోనే ఏలూరు బాధితులకు న్యాయం చేయాలి. అలాగే స్థానిక శాసనసభ్యుడు, ఆరోగ్యశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి అయిన శ్రీ ఆళ్ళ నాని పట్టణంలో వీధి వీధి తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకోవాలి. ఆశా వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది ప్రతి ఇంటికి తిరిగి పౌష్టికాహారం అందే విధంగా కృషి చేయాలి.

#### పాత్రికేయుల్లో ఉన్న తపన ప్రభుత్వంలో లేదు :

నివర్ తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు పర్యటిస్తున్నప్పుడే ఏలూరు సంఘటన మా దృష్టికి వచ్చింది. తక్షణమే స్పందించిన అధ్యక్షులు ముగ్గురు డాక్టర్ల బృందాన్ని ఈ ప్రాంతంలో పర్యటించి ఎటువంటి సహాయ సహకారాలు అందించాలన్న దానిపై నివేదిక ఇవ్వాలని కోరడం జరిగింది. ఈ నెల తొమ్మిదో తేదీన డాక్టర్ల బృందం నివేదిక ఇచ్చింది. దీనిపై పార్టీ నాయకులతో సమీక్షించిన అనంతరం మరికొన్ని వాస్తవ పరిస్థితులు తెలుసుకోవడానికి క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఇవాళ ఇక్కడికి వచ్చాం. అంతుచిక్కని మహమ్మారి వల్ల ఇప్పటి వరకు ఆరు వందల మందికి పైగా అస్వస్థతకు, 'గురయ్యారు. ఈ సమస్యను ప్రపంచానికి తెలియజేసి తద్వారా శాస్త్రవేత్తలు, వైద్యనిపుణుల సహకారం తీసుకోవాలని మీడియా మిత్రులు ప్రయత్నాలు చేస్తుంటే... ప్రభుత్వంలో మాత్రం ఆ తపన కనిపించడం లేదు. ఒక రోజు మాస్ హిస్టీరియా అని, మరో రోజు సమస్య తగ్గిపోయిందని చెప్పి, బాధ్యత వదిలి వ్యవహరించింది. వైరస్, బ్యాక్టీరియా ఉందా... కాలుష్యం వల్ల వ్యాధి వ్యాపించిందా అనేది సైంటిఫిక్ గా తెలుసుకోవాలే తప్ప రాజకీయంగా మాట్లాడాల్సిన అవసరం లేదు. ఏలూరు 'దుర్ఘటనలో ఎందుకు నిజాలను దాయడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది? ఇంటింటికి తిరిగి సర్వే చేసినప్పుడు మీకు వచ్చిన రిజల్ట్స్ ఏంటి? వ్యాధిని నిర్ధారించడానికి ఇప్పటివరకు ఎలాంటి పరీక్షలు చేశారు? ప్రాంతాల్లో నమూనాలు సేకరించారు? ఎలాంటి నమూనాలు సేకరించారు? సేకరించిన నమూనాలను ఎక్కడికి పంపిస్తున్నారు? రిపోర్టు తాలుకు రిజల్ట్స్ ఏంటి? అనేది ప్రజలకు ఎందుకు అందుబాటులో ఉంచలేకపోయారు? న్యూరోఫిజీషియన్ ఉండాల్సిన స్థానంలో న్యూరో సర్జన్ ను పెట్టారు. సరైన వైద్య నిపుణులను తీసుకురావడంలో ఎందుకు విఫలమయ్యారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

#### రైతాంగం కోసం ఈ నెల 28న కలెక్టర్లకు వినతి పత్రం

నివర్ తుపాన్ మూలంగా 17 లక్షల 30 వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. దాదాపు 9 లక్షల మంది రైతులు, తీవ్రంగా నష్టపోయారు. అదే విధంగా ఈ ఏడాది వచ్చిన మూడు ప్రకృతి విపత్తుల వల్ల రైతాంగం రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. ఇవన్నీ బేరీజు వేసుకొని ఎకరాకు రూ. 35 వేలు నష్టపరిహారం, తక్షణ ఆర్థిక సాయంగా రూ. 10 వేలు ఇవ్వాలని జనసేన పార్టీ తరపున డిమాండ్ చేశాం. మేము 48 గంటల్లో స్పందించాలని కోరితే ఐదు రోజులు దాటినా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడలేదు. రైతు భరోసా మూడో విడత కింద రెండు వేలు, ఇన్ ఫుట్ సబ్సిడీ రూ. 790 కోట్లు ఇస్తామని ప్రకటించారు. రైతుల నుంచి వచ్చిన డిమాండ్లు మేము ప్రభుత్వం ముందుంచితే... ప్రభుత్వం ఇచ్చింది కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే అది కూడా ఇన్ ఫుట్ సబ్సిడీ రూపంలో. నివర్ తుపాన్, ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 28న అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు, అందిస్తాం. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు కూడా పాల్గొంటారని" చెప్పారు.

### తిరుపతి లోక్ సభ పరిధిలో జనసేన కార్యనిర్వాహక కమిటీ...

తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికల నేపథ్యంలో పార్లమెంట్ స్థానం పరిధిలో పార్టీపరంగా శ్రేణులను సమాయత్తపరచి... జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి కార్యనిర్వాహక కమిటీని పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కల్యాణ్ గారు ఏర్పాటు చేశారు. పార్లమెంట్ స్థానం పరిధిలో క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ జనసేన విధానాలను ముందుకు తీసుకువెళ్లే విధంగా ఈ కమిటీ పని చేస్తుంది. ఈ కమిటీలో పార్టీపరంగా క్రియాశీలకంగా ఉన్నవారిని సభ్యులుగా నియమించారు.

#### కార్యనిర్వాహక కమిటీ సభ్యులు :

శ్రీ డా.పి.హరిప్రసాద్, శ్రీ మనుక్రాంత్ రెడ్డి,
శ్రీ రాందాస్ చౌదరి, శ్రీ కిరణ్ రాయల్,
శ్రీమతి వినుత, శ్రీ పొన్న యుగంధర్,
శ్రీ ఉయ్యాల ప్రవీణ్, శ్రీ తీగల చంద్రశేఖర్,
శ్రీ గూడూరు వెంకటేశ్వర్లు, శ్రీ కంటేపల్లి ప్రసాద్

ఈ కమిటీ తిరుపతి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో పర్యటనలు చేపడుతుంది. క్షేత్ర స్థాయిలో శ్రేణులను సమన్వయం చేసుకొంటూ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న ప్రజా సమస్యలను, రాజకీయ సంబంధిత విషయాలను క్రోడీకరించి ఎప్పటికప్పుడు పార్టీ అధ్యక్షులకు నివేదికలు అందచేస్తారు.

## జనసైనిక్ పంచ్

### జనసైనికుల మాట

- ఇసుక లేని ఇల్లు
- రాజధాని లేని రాష్ట్రం
- నోరు అదుపు లేని మంత్రులు
- మాట పడిపోయిన మేధావులు
- పారిపోయే స్టార్టప్లు
- ప్రజల ప్రాణాలను తీసే పరిశ్రమలు
- హద్దులు లేని రంగులు
- మొత్తుకుంటున్న వెంకన్న
- ఒక్క ఛాన్స్ అంటూ మోసపోయి
- అంధుడైపోయావు కదరా ఆంధ్రుడా !!!

### అమ్మను చూడడానికి వెళ్తే అక్కసు కక్కిన ప్రముఖ తెలుగు మీడియా ఛానెల్



ఒక ప్రముఖ మీడియా ఛానల్ పవన్ కళ్యాణ్ భార్యకు సంబంధించి పిచ్చి పిచ్చి కూతలు కూసింది. అంతకముందులాగే పవన్ కళ్యాణ్ పై విషం కక్కాలని ప్రయత్నించగా యధావిధిగా పవన్ కళ్యాణ్ అభిమానులు వాటిని తిప్పికొట్టారు. ఆ సదరు ఛానల్, రేటింగ్ ల కోసం..డబ్బుల కోసం ఇంటి ముందు చెప్పులు ఎవరివి ఉన్నా పట్టించుకునే రకం కాదు. ఇప్పటికే ఆ ఛానల్ ను బజారుకు ఈడ్చినా గడ్డి తినేవాళ్ళ బుద్ధి మారట్లేదు. ఆ ఛానల్ ప్రచురించిన కథనం ఒక బూటకమని తెలిసేలా పవన్ కళ్యాణ్ గారి భార్య ఫోటో ఒకటి సోషల్ మీడియా లో వైరల్ అవుతుంది. అన్నా లేజ్నీవో హైద్రాబాద్ ఎయిర్పోర్ట్ కు చేరుకున్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. అమ్మ గారిని చూడడానికి రష్యా వెళ్లిన ఆమెపై ఆ కారు కూతలు ఏంటంటూ మరొక్కసారి పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు మిగతావారు కూడా ఆ ఛానల్ పై దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ ఛానెల్స్ వాళ్ళ TRP రేటింగ్స్ కోసం వ్యక్తిగత జీవితాల్లోకి వెళ్ళి, భూతద్దం పెట్టి చూడడం మానేస్తే ఈ తెలుగు మీడియా ఛానెల్స్ బాగుపడతాయి అని నెటిజన్లు అంటున్నారు.

జనస్వరం వారసంచిక నందు "సంపాదకీయం" రాయాలన్న ఆసక్తి మీకు ఉంటే మా వాట్సప్ 9642067900 కు పంపించండి. లేదా మెయిల్ : janaswaramnews@gmail.com కు పంపండి. వెబ్ మీడియా మరియు వారసంచిక నందు ప్రచురిస్తాము.

## జనసేన బలోపేతం కోసం..మేము సైతం -"రాజ్యాధికారం" మా లక్ష్యం : పూతలపట్టు జనసైనికులు



చిత్తూరు ( జనస్వరం ) : పూతలపట్టు మండలం వేపనపల్లి జనసైనికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ రాయ్, శివయ్యలు మాట్లాడుతూ.. నీతి, నిజాయితీ, నిబద్ధతతో నిస్వార్థంగా జనసేనాని పవన్ కళ్యాణ్ అడుగు జాడల్లో నడుస్తూ.. "ఆశతో కాకుండా ఆశయ సాధనకోసం" ప్రజా సమస్యలపై అనునిత్యం స్పందిస్తూ, "అకుంఠిత దీక్షతో పని చేస్తున్న పూతలపట్టు నియోజకవర్గ జనసైనికులునుద్దేశించిమాట్లాడుతూ..క్షేత్రస్థాయిలో జనసేనపార్టీ బలోపేతంకోసం... మేముసైతం.. మీకు అండగా ఉంటామని "భరోసా" ఇచ్చారు. దేశ సమగ్రత ను దృష్టిలో ఉంచుకుని, అఖిల జనంకోసమే జనసేనాని పవన్ కళ్యాణ్ ఎన్నోఒత్తిళ్లను తట్టుకుని, ఒడిదుడుకులు, అవాంతరాలు వచ్చినప్పటికీ సమర్థవంతంగా జనసేనపార్టీని వ్యవస్థాపించారన్నారు. ప్రతిగ్రామంలో అందరి వాడైన అన్నయ్య మెగాస్టార్ చిరంజీవిని అమితంగా ఇష్టపడేవాళ్ళు, ఆరాధించేవాళ్ళు లెక్కకు మించి ఉన్నారన్నారు. మెగా ఫ్యామిలీకి, మెగా హీరోలందరిపట్ల ఆప్యాతానురాగాలు కలిగి ఎంతో క్రమశిక్షణ కలిగిన కోట్లాదిమంది అభిమానులను, కార్యకర్తలను పొందడం అంటే ఆషామాషీ కాదన్నారు. జనసేనాధిపతి పవన్ కళ్యాణ్ కూడా సమ సమాజ స్థాపనే ధ్యేయంగా అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారన్నారు. అంతే కాకుండా సిద్ధాంతాలను, ఆశయాలు ఏర్పరచుకున్న ఏకైక పార్టీ ఏదైనా ఉందా అంటే అది కేవలం జనసేనపార్టీ మాత్రమే అన్నారు.

## రోడ్డు, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని వినూత్న నిరసన చేపట్టిన విశాఖ పశ్చిమ నియోజకవర్గ జనసైనికులు




విశాఖపట్నం ( జనస్వరం ) : విశాఖపట్నంలో ఇండస్ట్రియల్ ప్రజలు అలాగే, గాజువాక ప్రజలు విశాఖపట్నం సిటీకి చేరుకోవాలంటే అతి సులువైన మార్గము కాన్వెంట్ రోడ్డు మార్గము. అయితే Essar కంపెనీ నుంచి కాన్వెంట్ కి వెళ్ళే దారిలో పెద్ద పెద్ద టిప్పర్లు కెమికల్స్, మినరల్స్ తీసుకువెళుతూ కవర్ కప్పకుండా రోడ్డు మీద జల్లుతూ వెళ్లడంతో ఇబ్బందిగా మారిందని పశ్చిమ నియోజకవర్గ జనసైనికులు అన్నారు. ఈ చలికాలంలోమంచువల్లరోడ్లుజారిపోతున్నాయి. అటుగా టూ వీలర్ మీద ప్రయాణిస్తున్న ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. చాలా మందికి కాళ్లు, చేతులు విరిగిపోవడం మరియు కొందరు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. కాబట్టి ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కారం చేయాలని జివిఎంసి కమిషనర్ కి, జోనల్ కమిషనర్ కి నేరుగా వెళ్లి విన్నవించడం జరిగింది . పోర్ట్ నుంచి వచ్చే ఈ వాహనాలు నిబంధనలు పాటించక పోవడం వలన విశాఖలో దుమ్ము కాలుష్యం పెరగడానికి ఒక కారణం అని గమనించాలని అన్నారు. అదేవిధంగా అటువైపు ప్రయాణించే టూవీలర్ వాహనదారులకు అవగాహన కల్పించడానికి బ్యానర్లు పెట్టడం కూడా జరిగింది. రోడ్డుకి ఇరువైపులా బ్యానర్లు చేతిలో పట్టుకొని వినూత్న నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం జనసేన యువ నాయకులు ధర్మేంద్ర ఇండస్ట్రియల్ బెల్టు నాయకుల శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలని రామచంద్రపురం నియోజకవర్గ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ ను కోరిన స్థానికులు



తూర్పు గోదావరి ( జనస్వరం ) : రామచంద్రపురం నియోజవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ శ్రీ పోలిశెట్టి చంద్రశేఖర్ గారు గంగవరం గ్రామంలో పర్యటించినప్పుడు అక్కడున్న రైల్వే కాలనీలో ప్రజలు మాకు మంచినీటి సదుపాయం లేదని, మంచి నీళ్లు రావడం లేదని, కుళాయి వచ్చేది ఒక అరగంట మాత్రమే వస్తుందని ఇంటికి రెండు మూడు బిందెలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. మాకు తాగడానికి మంచినీళ్లు లేవు అని ప్రజలు చెప్పడం జరిగింది. ప్రజలు నీటి సమస్యలు విన్న వెంటనే పోలిశెట్టి చంద్రశేఖర్ గారు స్పందించి మీకు మంచి నీటి కోసం ప్రభుత్వంతో పోరాడి మీకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామని, మీ పోరాటానికి మీతో కలిసి నడుస్తామని, మీకు మంచి నీళ్లు వచ్చే వరకు కూడా మీతో కలిసి పోరాటం కొనసాగిస్తామని ప్రజలతో చెప్పడం జరిగింది. ఈ నీటి సమస్య పై గత నెలలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారితో శ్రీ పోలిశెట్టి చంద్రశేఖర్ గారు మాట్లాడడం జరిగింది. ఈ మధ్యకాలంలో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ గారిని మీడియా పూర్వకంగా అడగడం జరిగింది. అయినప్పటికీ ఈ నీటి సమస్య తీరకపోవడం తో ఆ నీటి సమస్య చంద్రశేఖర్ గారి దృష్టికి తీసుకురావడం జరిగింది.

## 8 నెలల నుండి ప్రతి నెలా వృద్ధులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న జనసేన వీర మహిళ డా. చుండూరి మల్లేశ్వరి



భీమవరం ( జనస్వరం ) : జనసేనాని శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారు ఇచ్చిన స్ఫూర్తితో ఎన్నో సేవా కార్యక్రమాలకు చేయూతనిచ్చే గొప్ప మనసున్న మనస్తత్వంతో, మానవత్వంతో డా. చుండూరి మల్లేశ్వరి గారు జనసేనకు తన సేవ చేస్తున్నారు. భీమవరంలో ఉన్న ఒక వృద్ధ దంపతులకు ప్రతినెల కావలసిన నిత్యావసర వస్తువులు,అందిస్తున్నారు. 8 నెలల నుంచి నిత్యావసర వస్తువులు ఇవ్వడం విశేషం. ఎక్కడ సమస్య ఉందో, ఎక్కడ ఆకలి ఉందో, ఎక్కడ క్షోభ ఉందో అక్కడ జనసేన అండగా ఉండాలని సేనాని ఇచ్చిన పిలుపు మేరకు ఈ పేద తల్లిదండ్రులకు బాసటగా నిలిచారు. లాక్ డౌన్ ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈరోజు కూడా వాళ్లకి కావాల్సిన డిసెంబర్ నెలకి సరిపడా బియ్యం, ఇంట్లో కావాల్సిన నిత్యావసర సరుకులు డా. చుండూరి మల్లేశ్వరి గారు అందజేశారు.

## క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తిప్పాన వెంకట్ సత్యంకు ఆర్థిక సాయం అందజేసిన జనసేన నాయకులు డి చిరంజీవి



శ్రీకాకుళం ( జనస్వరం ) : శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలంలో జేఆర్ పురం పంచాయతీ వెంకటేశ్వర కాలనీలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తిప్పాన వెంకట్ సత్యంకు ఆర్థిక సాయం అందజేసిన జనసేన నాయకులు డి చిరంజీవి. జనసేన నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎవరికి ఎక్కడ కష్టం వచ్చిన జనసేన పార్టీ గుర్తుకు వస్తోంది అని తెలియజేశారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుగా స్పందించి పరిష్కారం చెప్పేది ఒక్క జనసేన మాత్రమే అని ఆయన అన్నారు. పార్టీలతో, కులాలతో మతాలతో సంబంధం లేకుండా అందరికి సమన్యాయం చేసేది ఒక్క జనసేన మాత్రమే అని చెప్పారు. కరోనా కష్టకాలంలో జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి పిలుపు మేరకు జనసేవ కార్యక్రమం ద్వారా ఎంతో మందికి సేవలు చేస్తున్నారని అన్నారు.

జన స్వరం
అక్షరమే ఆయుధం
www. Janaswaram.com

## పాఠకులకు మనవి

జనస్వరం ఈ - వార్తాపత్రిక (వార సంచిక) నందు మీ గళమైన వాణిని వినిపించాలనుకుంటున్నారా ? మీ నియోజకవర్గ ప్రాంతంలో జరిగిన సంఘటనలను మన వార్తాపత్రిక నందు పంచుకోవాలనుకుంటున్నారా ? మీ సమస్యలను మా పత్రిక నందు విన్నవించుకోవాలని అనుకుంటున్నారా ? మీ స్వరంతో ప్రజలకు మరింత చేరువ అవ్వాలంటే మాకు ఈ క్రింది వాటికి పంపించండి.

9642067900

janaswaramnews@gmail.com

జనస్వరం న్యూస్ వెబ్సైట్ మరియు వార్తాపత్రిక మరింత నాణ్యమైన వార్తాప్రపంచాన్ని మీ ముందుకు తీసుకురావడానికి మీ వంతు సహాయంగా ఆర్థికంగా చేదోడుగా నిలవాలని కోరుకుంటున్నాము.

Phonepe/Googlepay

UPI id : janaswaram@ybl